## రేషన్ షాపులు,గోదాములను కలెక్టర్ నిఖిల ఆకస్మిక తనిఖీ





ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :

సోమవారం విరారాబాద్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో గల చౌకధర దుకాణాన్ని ,వికారాబాద్ పట్టణంలోని పౌరసరఫరాల గోదామును అలాగే పరిగి మండలంలోని నస్కల్,సయ్యద్ పల్లి గ్రామాలలో గల చౌకధర దుకాణాలను జిల్లా కలెక్టర్ నిఖిల ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా దుకాణాలలో నిర్వహించే స్టాక్ రిజిస్టర్,స్టాక్ తెలిపే బోర్డులను,బయోమెట్రిక్ ఈ-పాస్ యంత్రాలను పరిశీలించారు.స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఓపెనింగ్ బ్యాలెన్స్,క్లోజింగ్ బ్యాలెన్స్ వివరాలు పరిశీలించారు.ఒక్కొక్క షాపులో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నరని వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులందరికి సకాలంలో రేషన్ బియ్యం అందించాలని సూచించారు.పౌరసరఫరాల గోదాంలో గల తూకం యంత్రాన్ని స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.డీలర్లకు సకాలంలో కమిషన్ డబ్బులు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

సయ్యద్‌పల్లి గ్రామంలో రేషన్ దుకాణాన్ని రైతు వేదికలో నిర్వహించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే వేరే స్థలానికి మార్చాలని సూచించారు.చౌకధర దుకాణంలో స్టాక్ రిజిస్టర్,స్టాక్ బోర్డు లేకపోవడం పట్ల సంబంధిత డీలర్‌కు షోకేస్ నోటీస్ జారీ చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారిని ఆదేశించారు.అనంతరం సయ్యద్ పల్లి గ్రామంలోని క్రీడా ప్రాంగణాన్ని ,హరితహారం నర్సరీని జిల్లా కలెక్టర్ సందర్శించారు.క్రీడా ప్రాంగణం,నర్సరీ నిర్వహణ బాగుందని ప్రశంసించారు.తనిఖీ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పౌరసరఫరాలు శాఖ అధికారి రాజేశ్వర్,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల,వికారాబాద్ తహసీల్దార్,వాహేదా కాతూన్,పరిగి తహసీల్దార్ రాంబాబు,ఎంపిడివో శేషగిరి శర్మ,పౌరసరఫరాల శాఖ డిటీలు,కార్తీక్,శ్రీనివాస్‌లు,తదితరులు పాల్గొన్నారు.

## 30న అర్చక పరీక్షలపై అవగాహన సదస్సు

జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 26,(ప్రభాతవార్త):

ఈ నెల 30వ తేదిన ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో అర్చక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ధూప దీప నైవేద్య సంఘం సభ్యుడు జోషి సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సును హైదరాబాద్ కాచిగూడలో గల తుల్జాభవన్ ధర్మశాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2023 జనవరి 6,7 తేదిలలో అర్చక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలు 10సంవత్సరాల తరువాత నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్చకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## ప్రస్తుత తహసీల్దార్ అయినా మాకు న్యాయం చేయాలి

-చిల్కూర్ రైతులు, మత్స్యకారులు, మొర

**మొయినాబాద్, డిసెంబర్26, ప్రభాతవార్త :** ప్రస్తుతం ఇప్పుడు ఉన్న తహశిల్దార్ అశోక్ కుమార్ అయినా మాకు న్యాయం చేయాలని చిల్కూర్ రైతులు, మత్స్యకారులు మెరపెట్టుకుంటున్నారు, మొయినా బాద్ మండలంలోని చిల్కూర్ రెవెన్యూలో గల సర్వేనెం 121, 119 లో గల భూమి నుండి 116 సర్వేనెంబరులో భూమి కలిగినరైతులకు నక్షబాట బండ్లబాట దారి ఉన్నప్పటికి నగరానికి చెందిన పర్వత నేని అరుణ్, తండ్రి పర్వతనేని భూపయ్య, అతని కుమారుడు నితిన్, రోడ్డును కబ్జాచేసి 116 సర్వేనెంబర్‌లో గల రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు, ఇట్టి విషయం పై జనవరి 12, 2022లో గతంలో ఉన్న తహశిల్దార్‌కు వినతిపత్రంతో రైతులందరం కలిసి పిర్యాదుచేశామని, కాని నేటికి మాకు న్యాయం జరగలేదని రైతులు గోడువెల్లబోసుకుంటున్నారు, ప్రస్తుతం మొయినాబాద్ మండల తహశి ల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అశోకుమార్ వెంటనే చర్యలు తీసుకోని గ్రామ రైతులకు మత్స్య కారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు, ఏండ్ల నుండి వ్యవసాయం చేస్తున్న దారిని కబ్జాచేసి రైతలును వేదించడం ఎంతో వేదనకలిగిస్తుందని మేము వ్యవసాయాలు ఎలా చేయాలని, మాకు వ్యవసాయం తప్ప మరోపని రాదని, చేతులు జోడించి వేడుకుంటున్నామని, రైతులకు న్యాయం చేయాలని తహశిల్దార్‌ను కోరుతున్నారు.

# హకీంపేట్ ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతికి ఘన స్వాగతం



హకీంపేట్ ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ ఘనంగ స్వాగతం పలికిన దృశ్యం



రాష్ట్రపతికి రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి కలిసి స్వాగతం పలికిన దృశ్యం



రాష్ట్రపతికి మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి కలిసి స్వాగతం పలికిన దృశ్యం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 26, ప్రభాతవార్త

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హకీంపేట్ ఎయిర్‌పోర్టులో పలువురి నుంచి ఘనస్వాగతం లభించింది. సోమవారం సాయంత్రం మేడ్చల్ జిల్లా హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి చేరుకున్నారు. ముందుగా త్రివిధ దళాల నుంచి రాష్ట్రపతి ప్రత్యేక వాహనంలో గౌరవవందనాన్ని స్వీకరించారు. ఆ తరువాత ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన సభాస్థలికి రాష్ట్రపతి ప్రత్యేక వాహనంలో చేరుకున్నారు. హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్, అదే విధంగ రాష్ట్ర ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్‌రావులు రాష్ట్రపతికి ఘనంగ స్వాగతం పలికారు. దీనికి ముందుగా రాష్ట్రపతి రాక సంద్భంగ సిఎం కెసిఆర్ హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు ముందుగానే చేరుకుని స్వాగత ఏర్పాట్లను పర్యటించి పరిశీలించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, పలువురు రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డిజిపి మహేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి, పలువురు ఎంపిలు,ఎమ్మెల్సీలు, కార్పోరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగ స్వాగతం పలికారు. అయితే మేడ్చల్ జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీశ్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, తూంకుంట మున్సిపల్ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డిసిపి సందీప్, డిఆర్‌ఓ లింగ్యానాయక్, ఆర్డీఓ రవి, సంబధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రాష్ట్రపతికి స్వాగతం పలికారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం నగరంలోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో బస చేయటానికి విచ్చేశారు. హకీంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంకు ఆమె బయలు దేరటం జరిగింది.

# ఆధ్యాత్మిక జ్ఞానంతోనే ఆనందమైన జీవితం...

-ప్రతి జీవిలో భగవంతుడు ఉన్నాడు...

-ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శనలు...

కడ్తాల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:

భారతదేశ గొప్పతనం ధ్యానమే... ధ్యానంతోనే అందం.. ఆనందం... ఆరోగ్యం... సౌభాగ్యం... ధ్యానంతోనే జీవితం మోక్షం... ప్రతి జీవిలో భగవంతుడు ఉన్నాడని పత్రీజీ చిన్న కూతురు పరిమళ పత్రీ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహాయాగం, మహిళా ధ్యాన మహాచక్రం-4 వేడుకలు సోమవారం 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధ్యానులతో కలిసి ఉదయం 5 గంటల నుంచి 7.30 గంటల వరకు సామూహిక ప్రాత: కాల ధ్యానం నిర్వహించారు. సోమవారం పత్రీజీ సామూహిక వేణు నాదంతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యాన్ని, ధర్మాన్ని అనుసరించి ముందుకు సాగేవారు ఆనందయ జీవితాన్ని, ఆత్మ జ్ఞానాన్ని, దైవానుగ్రహాన్ని పొందుతారన్నారు. చేసే పనిని బట్టి ఫలితం ఉంటుందన్నారు. శ్వాస మీద ధ్యాసతోనే వ్యక్తికి పరిపూర్ణ స్థితి లభిస్తుందని, అది ధ్యానం ద్వారానే సిద్ధిస్తుందన్నారు. ఆధ్యాత్మిక జ్ఞానంతోనే ఆనందమైన జీవితం సాధ్యమవుతుందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు సేవ భావంతో మెలుగాలని, అహింస మార్గాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. హింసలేని ప్రపంచం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ధ్యాన సంబురాల్లో భాగంగా పిరమిడ్ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గౌతమ బుద్ధిని భార్య పేరు యశోధర దేవి అని, గౌతమబుద్ధుడు సమాజాన్ని వదిలి యోగాన్ని సాధిస్తే ఆమె ఇంట్లో ఉంటూ సంఘాన్ని, కుటుంబాన్ని, పాలన చూసుకుంటూ కుమారుడిని రాజుగా మార్చిన వీరవనిత అని కొనియాడారు. అలాంటి మహిళ నేటి తరం మహిళలకు ఆదర్శం కావాలని ఆయన సూచించారు. నార్త్ ఇండియన్ మాస్టర్ కిరణ్ గుర్బానీ ముంబై, శోభ లక్నో తమ ధ్యాన అనుభవాలు పంచుకున్నారు. పీఎంసీ హిందీ నిర్వాహకురాలు ఆలేఖ్య పీఎంసీ హిందీ బ్రోచర్‌ను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. యాగంలో అన్నదాన కార్యక్రమాలకు ది హైదరాబాద్ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ట్రస్ట్ చైర్మన్ సతీమణి నీరజ విజయ్ భాస్కర్‌రెడ్డి రూ.1.25లక్షలు విరాళాలు అందించారు. కార్యక్రమంలో పిరమిడ్ మెడిటేషన్ చానెల్ డైరెక్టర్ నవకాంత్, మారం శివప్రసాద్, మేనేజింగ్ ట్రస్టీ బాలకృష్ణ, రాయ జగపతి రాజు, కిషన్‌రెడ్డి,మారిసోలో, అంటోని మాధవి, పత్రీజీ కూతుళ్లు పరిణత పత్రీజీ, పరిమళ పత్రీజీ, ట్రస్ట్ సభ్యులు రాంబాబు, సాంబశివరావు, హన్మంత్ రాజు, బాలకృష్ణ, నవకాంత్,జయశ్రీ శ్రీరామ్, గోపాల్, దామోదర్‌రెడ్డి, మాధవి, లక్ష్మి, జ్యోతి, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న కళాకారిణి



హజరైన ధ్యానులు

## శ్రీవారి ఆలయంలో వైభవంగా కొనసాగుతున్న ధనుర్మాస పూజలు



ఆలయంలో ధనుర్మాస పూజలకు తరలివచ్చిన భక్తులు

కొడంగల్,డిసెంబర్ 26ప్రభాతవార్త

పేదల పెన్నిధిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న శ్రీమహలక్ష్మీ వేంకటేశ్వర దేవాలయంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఈనెల 17 నుంచి ప్రారంభమైన ధనుర్మాస పూజలు తిరుమల తిరుపతి దేవాలయంలో మాదిగానే ఆలయంలో ప్రతి నిత్యం వేకువ జామున సుప్రభాత సేవతో మొదలుకొని శ్రీమాన్ ధరూరి శ్రీనివాసాచారి అద వ్ర్యంలో తీరుప్పావై పారాయణం పఠనంతో భక్తులకు వినిపిస్తున్నారు.ధనుర్మాస పూజలో భాగంగా స్వామి వారికి విశేష అలంకరణలతో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్ మాట్లాడుతు ధనుర్మాస పూజలు జనవరి 14 వరకు పూజలు కొనసాగుతాయన్నారు.అలాగే జనవరి 14న గోదాదేవి కళ్యాణోత్సవం,తిరుచ్చి ఉత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు.15న శ్రీవారి తిరుచ్చి ఉత్సవం,16న పద్మావతి అమ్మవారికి అలంకరణ పుష్కరిణి ఆవరణలో కనుమ పండుగ ఉత్సవం అలంకరణ తిరుమంజనం ఉత్సవం వైభవంగా కొనసాగనున్నట్లు తెలిపారు.ధనుర్మాస పూజల్లో భాగంగా భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ధనుర్మాస పూజలకు కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమ్రోగుతుంది.

# దోపిడీ లేని నవ సమాజ నిర్మాణమే సిపిఐ లక్ష్యం

షాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :

భారతదేశంలో దోపిడి లేని సమాజం నిర్మాణమే సీపీఐ లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. సీపీఐ 98వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని షాబాద్, కుర్వగూడ, నాగర్‌కుంట గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం కార్యకర్తలను నిర్దేశించి మాట్లాడారు. భారతదేశంలో కుల పీడన మతోన్మాదం ఆర్థిక దోపిడి విస్తృతంగా కొనసాగుతున్నదని కార్మికుల పేదల బ్రతుకులు నలిగిపోతున్నాయన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావించిన తర్వాతనే పేదలపై పెట్టుబడిదారు వర్గాలు, భూస్వాముల ఆగడాలు ఆర్థిక దోపిడి కొంతమేరకైన కంట్రోల్లో ఉన్నాయని కమ్యూనిస్టు పార్టీ లేకపోతే ప్రజల పరిస్థితులు ఆదోరకంగా ఉండేవని గుర్తు చేశారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి మొదలుకుంటే నేడు జరుగుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల వరకు సీపీఐ పాత్ర అమోఘమైనదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని ఇండ్లు లేని పేదల కోసం ఇండ్ల స్థలాల కోసం భూపోరాటాలు నిర్వహిస్తామన్నారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, సహాయ కార్యదర్శి రుక్కయ్య, నాగర్‌కుంట ఉపసర్పంచ్ రఘురాం, మండల నాయకులు రాములు, శ్రీశైలం, పాండు, పోచయ్య, నారాయణ, మధు తదితరులు ఉన్నారు.



సీపీఐ పార్టీ జెండాను ఎగురవేస్తున్న పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

# కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనటానికి సిద్ధం

-భయపడాల్సిన అవసరం లేదు

-మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

-జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-కొవిడ్ టీకాలు వేయించుకోవాలి..నిబంధనలు పాటించాలి

-మాస్కులు ధరించాలి..భౌతికదూరం పాటించాలి

-శానిటైజర్లు తో చేతులు తరుచూ శుభ్రం చేసుకోవాలి



.మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 26, ప్రభాతవార్త

ప్రస్తుత పరిస్థితితులపై భయపడాల్సిన అవసరం లేదని, జిల్లా ప్రజలు అప్రమత్తంగ ఉండాల్సిన అవసరం ఉందని, కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనటానికి ఆరోగ్యశాఖ సిద్దంగ ఉన్నట్లు, ఆరోగ్యం కోసం నిబంధనలు పాటించాలని మేడ్చల్ జిల్లా ఆరోగ్య శాఖ అన్ని సహాయ సహకారాలు అందించటానికి సిద్దంగ ఉందని మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా సంబంధిత ప్రోగ్రామ్స్ ఆఫీసర్స్, హాస్పిటల్స్ అధికారులతో జిల్లాలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, వెంటిలేటర్లు, ఆర్‌టి-పిసిఆర్‌అండ్ ఆర్‌ఎటి పరీక్షా కేంద్రాలు, బెడ్ స్ట్రెంత్, మానవ వనరుల ఆవశ్యకత, ఆక్సిజన్ ప్లాంట్ ప్రభుత్వ,ప్రైవేట్ రెండింటిలోనూ లభ్యత గురించి జిల్లా అధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు ప్రజలు భౌతిక దూరం పాటించటం, మాస్కులు ధరించటం, శానిటైజర్ లేదా సబ్బుతో చేతులు తరుచుగా శుభ్రం చేసుకోవటం చేయాలన్నారు. దగ్గినపుడు, తుమ్మినపుడు నోరు, ముక్కును మోచేయితో కప్పుకోవాలని ఆ అలాంటి ఆరోగ్యభద్రతా పద్దతులు, కోవిడ్ నిబంధనలు పాటించాలని అన్నారు. యుద్ద ప్రాతిపదికన కోవిడ్ టీకాలు వేయించుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ జిల్లా ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా సంబంధిత అధికారులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు

# బొకేలు శాలువాలు వద్దు

-నోట్ బుక్స్‌స్టేషనరీ, అంగన్‌వాడీ పిల్లలకు మ్యాట్‌లు ఇవ్వండి

-మీగ్రామాల్లో మీ వార్డుల్లో పాఠశాలలను దత్తత తీసుకోండి

-వృధా ఖర్చుల స్థానంలో ఒక మంచి పనికి ముందుకు రండి

-రానున్న నూతన సంవత్సరానికి ఒక కొత్త నిర్ణయం తీసుకోండి

-ప్రజాప్రతినిధులు,నాయకులు,అధికారులు,ప్రజలకు

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి

ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి:

నూతన సంవత్సరం సందర్భంగా తనను కలువటానికి వచ్చే వారు ఎవరు కూడా బొకేలు,శాలువాలు తీసుకురావొద్దని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.ఇతర నేతలను,అధికారులను కలువటానికి వెళ్లేటప్పుడు కూడా ఇదే విధంగా ముందుకు వెళ్లాలని కోరారు.అలాంటి వృధా ఖర్చుల స్థానంలో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.వాటి స్థానంలో విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, బ్యాగులు ,వాటర్ బాటిల్స్ ,పెన్నులు,పెన్సిళ్లు ,అంగన్‌వాడీ పిల్లలకు మ్యాట్లు,చిన్న వాటర్ బాటిళ్లు,ఇతరత్రా వాటిని అందించాలని కోరారు.రానున్న నూతన సంవత్సరం 2023 సందర్భంగా అందరూ ఒక కొత్త నిర్ణయం తీసుకొని ,అమలు చేయాలని కోరారు.నూతన సంవత్సరంతో పాటుగా జన్మదినాల సందర్భంగా ఇలాంటి సమాజ హిత కార్యక్రమం చేపట్టడం ద్వారా పేద,మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు.వివిధ కార్యక్రమాల సందర్భంగా కూడా ఇదే విధానాన్ని పాటించాలని కోరారు.ప్రజలు,ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,అధికారులు ఈదిశగా రానున్న జనవరి ఒకటో తేది నుండి ఈ నిర్ణయాన్ని అమలు చేసి జిల్లాలో ఓ సరికొత్త విధానినికి నాంది పలుకలన్నారు.నాయకులు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని ఆయా పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

## నమ్మించి మోసం చేయడంలో

# బిజెపికి సాటిలేరు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ

- ఎస్సీ వర్గీకరణను ఆమోదించకపోతే

బిజెపిపై మాదిగల తిరుగుబాటు తథ్యం

**షాద్‌నగర్, డిసెంబర్ 26, (ప్రభాతవార్త) :** ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ప్రభుత్వం గతంలో రెండు సార్లు తిరుపతి, భద్రాచలం దేవస్థానాల్లో తీర్మాణాలు చేసి వాటిని అమలు చేయకుండా నమ్మించి మోసం చేస్తున్నారని, ప్రజలను నమ్మించి మోసం చేయడంలో బీజేపీ సాటిలేరని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ ఎద్దేవా చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నరసింహ మాదిగ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లోని నాగులపల్లి రోడ్డులో ఉన్న సాయిరాజ పంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్‌రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవుళ్ల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చి అందలం ఎక్కిన తరువాత వాటిని విస్మరించడం బీజేపీకే సాధ్యపడిందని, ప్రజలను నమ్మించి మోసం చేయడంలో బీజేపీకి తెలిసినంత మారేవరికి తెలియదని ఆయన పేర్కొన్నారు. 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను పక్కన బెట్టిన మాదిగల ద్రోహి బీజేపీ అని ఆయన మండిపడ్డారు. బీజేపీ సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి అన్నారు. మాదిగలను మోసం చేస్తున్న విషయాలను తెలంగాణలోని అన్నికులాల ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారని, తగిన రాజకీయ మూల్యం బీజేపీ చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇకనైనా ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే రాబోయే రోజుల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీజేపీ తగిన బుద్ది చెబుతామని ఆయన అన్నారు. బీజేపీ పై మాదిగల తిరుగుబాటు మొదలవుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ, జిల్లా కోకన్వీనర్ తుడుం కిరణ్‌మాదిగ, గ్యారా సురేష్‌మాదిగ, ఎంఎస్‌పీ నాయకుల బుర్ర రామచంద్రయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ మహేశ్వరం ఇంఛార్జీ ఎర్రోళ్ల నవీన్‌కుమార్ మాదిగ, కిరణ్‌పూలే మాదిగ, శ్రీకాంత్ మాదిగ, శేఖర్ మాదిగ, కొమ్ము మహేష్ మాదిగ, రాము మాదిగ, పాండు మాదిగ, బొబ్బిలి పాండు మాదిగ, ఎంఎస్‌ఎఫ్ నాకురాలు సుమతి మాదిగ, మల్లేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి

**-ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



విద్యార్థులను సన్మానించి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్, ఆయన సతీమణి డాక్టర్ సబిత

**వికారాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**
విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి, సబితా ఆనంద్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సబితా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సబితా ఆనంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. పాఠశాల, కళాశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల్లోని నైపుణ్యత ం గుర్తించి, వారి ఆలోచనలకు ఆయువు పోస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో సబితా ఆనంద్ ఫౌండేషన్‌ఖి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థి దశలో ఇంటర్ మీడియట్ దశ అత్యంత ప్రాముఖ్యమైనదని, విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలు గుర్తించుకొని, కష్టమైన ఇష్ట పడి చదువుతూ ఎవరి జీవితాలు వారే చక్కదిద్దుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు భానిసలు కాకుండా మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. వికారాబాద్ లోని పాఠశాలల్లో, కళాశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన 162 మంది విద్యార్థులు ఘనంగా సన్మానించడం జరిగిందని సబితా ఆనంద్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సబితా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ముత్యం రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, నవీన్‌కుమార్, పుష్పలతారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మేక శేఖర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాంరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో సైనికుల సంక్షేమ భవనం,క్యాంటిన్ ఏర్పాటు చేయాలి

**-ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి మాజీ సైనికుల వినతి**



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

**కొడంగల్,డిసెంబర్ 26ప్రభాతవార్త**
కొడంగల్ నియోజకవర్గంలో సైనికులు,మాజీ సైనికుల సంక్షేమం కోసం భవనంతో పాటు క్యాంటిన్‌ను ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కొడంగల్ నియోజకవర్గ మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీ.రాములు,బి.వెంకటయ్య,పీబీ.అశోక్‌కుమార్‌లు కోరారు.ఈ మేరకు సోమవారం అసోసియేషన్ సభ్యులు హైద్రాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొడంగల్ నియోజకవర్గంలో అత్యధికంగా రెండువేల నుంచి 2200 వరకు సైనికులు,మాజీ సైనికులు ఉన్నారని వీరి సమస్యలపై ఇటీవలే ప్రసార మాధ్యమాల్లో ప్రసారం కావడం జరిగిందని గుర్తు చేశారు. నియోజకవర్గంలో మాజీ సైనికులు,సర్వీసులో ఉన్న సైనికులకు సంక్షేమ భవనం లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.మాజీ సైనికులు,వితంతువులు,సర్వీసులో ఉన్న సైనికుల కుటుంబ సభ్యులు క్యాంటీన్ నుంచి సామాగ్రి తీసుకునేందుకు సూదూర ప్రాంతాలైన హైద్రాబాద్,మహబుబ్‌నగర్ లాంటి ప్రాంతాలకు వెళ్ళి తెచ్చుకోవడం చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.దేశ రక్షణ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి వృత్తినే దైవంగా తలిచే మాజీ సైనికులు,సర్వీసులో ఉన్న సైనికుల సౌకర్యార్థం కొడంగల్‌లో సైనిక సంక్షేమ భవనంతో పాటు క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు అందించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.స్పందించిన ఎమ్మెల్యే తహశీల్దార్‌తో మాట్లాడి మాజీ సైనికుల సంక్షేమ భవనంతో పాటు క్యాంటీన్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని హమీ ఇచ్చినట్లు వారు తెలిపారు.కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సంతోష్‌కుమార్,నరహరిగౌడ్,జీ.వెంకటయ్య,రషీద్ పాషా, పకీరప్ప, డి.బసప్ప తదితరులున్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**దోమ.డిసెంబర్ 26 ప్రబాతవార్త.**
దోమ మండల కేంద్రములో మంగళిభారతమ్మ మృతిచందడంతో విషయం తెలుసుకున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి తన అనుచరులు వికారాబాద్‌జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్ ద్వార తన అనుచరులతో వెళ్ళి కుటుంబసభ్యులను పరమార్శించి మృతురాలి కుటుంబ సభ్యులకు అంత్యక్రియలకు కోసం నగదు 5000 అందజేశారు.మండల పరిదిలోని అయినాపూర్ కే.శే.ముష్టిరాములు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు గ్రామములో వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించగా కార్యక్రమానికి డిసిసిబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి తన అనుచరుల ద్వారా టోర్నమెంట్‌కునగదు 30000 వేల రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అయినాపూర్ సర్పంచ్ మల్లేశం,గ్రామరైతుసమన్వయ అద్యక్షులు జనార్ధన్‌గౌడ్,ఎంపిటిసి విజయఅంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, సుబాన్,గోవర్ధన్,కిష్టయ్య,అంజిలయ్య,నర్సిములు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం

**- ఎలికట్ట సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్**

**షాద్‌నగర్, డిసెంబర్ 26, (ప్రభాతవార్త) :**
ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఓ వరంలాంటిదని, ఆపద సమయంలో అపన్నహస్తంగా ఉపయోగపడుతుందని ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ సర్పంచి సాయిప్రసాద్‌యాదవ్ అన్నారు. సోమవారం ఎలికట్ట గ్రామానికి చెందిన జె.సుమకు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆదేశాల మేరకు రూ. 30 వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో ఎంతో మంది లబ్ధిపొందుతున్నారని, సీఎం సహాయ నిధికి ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి లబ్ధి అందేవిధంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చూస్తున్నారని ఆయన కొనియాడారు. ఎలికట్ట గ్రామంలో సహితం సీఎం సహాయ నిధికి ధరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి అందేవిధంగా చూస్తున్నామని, ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న సర్పంచ్‌సాయిప్రసాద్‌యాదవ్

# ఘనంగా సిపిఐ ఆవిర్భావ వేడుకలు

**తాండూరు పట్టణంలో**

**తాండూరు, డిసెంబరు 26, ప్రభాతవార్త :** భారత కమ్యూనిష్టు పార్టీ ఆవిర్భావ వేడుకలను తాండూరులో ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు విజయలక్ష్మి పండిత్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో సిపిఐ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమ సమాజం కోసం సిపిఐ చేసిన పోరాటాలు విప్లవాల చరిత్రలో నిలిచాయని అభివర్ణించారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం కోసం, ప్రజలందరు సుఖ శాంతులతో ఉండాలని ఎంఎస్ రాయ్ వంటి విప్లవ కారులతో 1920లోనే పార్టీ నిర్మాణం జరిగిందని, 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో భారత కమ్యూనిష్టు పార్టీ మొదటి మహాసభను ఏర్పాటు చేసి పార్టీని ప్రారంభించారని గుర్తు చేశారు. నాయకులు, కార్యకర్తలు చేసిన వీరోచిత పోరాటాలు, త్యాగాలు మానవతవిలువలున్న ఈ దేశ ప్రజలందరు గుర్తించి పార్టీని గౌరవించాలని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుద పోరాటంతో పాటు బెంగాల్, కేరళ, మణిపూర్‌లలో స్వాతంత్ర్యానికి పూర్వం సిపిఐ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు ప్రపంచ విప్లవ చరిత్రలో భాగమయినాయని అన్నారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా సామాజికన్యాయం, సమసమాజ నిర్మాణం కోసం పేద, మధ్య తరగతి ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, మహిళల సమస్యల పరిష్కారంకోసం పోరాడుతూ వస్తుందని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ కోసం ముందుగా సిపిఐ పార్టీ తీర్మానించి పోరాటం చేయడం జరిగిందని గుర్తు చేశారు. తాండూరులో కూడ ఎన్నో సమస్యలపై నిరంతరం పోరాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలు దగ్గరుండి జరిపించామని పేర్కొన్నారు. విద్యారంగ అబివృద్ధి కోసం, విద్యార్థులకు మంచి చదువులు అందించేందుకు అంకిత భావంతో కృషి చేశామని తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా, పేద మురికి వాడలు, డ్వాక్రా మహిళల కోసం చైతన్యవంతం చేస్తూ వారికి అందుబాటులో ఉండి ఉద్యమాలు చేశామని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి మునీర్, నాయకులు రాజశేఖర్, దస్తప్ప, నసీమాబేగం, మాణెమ్మ, నర్సింలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొడంగల్ మండలంలో**

**కొడంగల్,డిసెంబర్ 26ప్రభాతవార్త :** ప్రజా సమస్యల సాధన కోసం నిరంతర పోరాటాలతో సిపిఐ ప్రజల పక్షాన ముందుకు వెళ్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్ అన్నారు.సోమవారం కొడంగల్ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా లాల్ దర్బార్‌లో పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.సిపిఐ 98వ పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడంగల్ మండల పార్టీ కార్యదర్శి సిరుసన్ శ్యాంసుందర్ పార్టీ జెండాను అవిష్కరించారు.కార్యక్రమానికి హజరైన ఇందనూర్ బషీర్ మాట్లాడుతు 1925 డిసెంబర్ 26న కాన్పుర్‌లో స్థాపించిన సీపీఐ పార్టీ 97 వసంతాలు పూర్తి చేసుకొని 98వ వసంతంలోకి అడుగుపెడుతున్నదని పేర్కొన్నారు.పార్టీ స్థాపించిన నాటి నుంచి నిషేదాలు నీరట్ కాన్పుత్రాకే సొంత అంశాలను భరించి అనేక పోరాటాలు కొనసాగించిందని తెలిపారు.స్వతంత్రం తర్వాత సంపూర్ణ స్వాతంత్రం సంస్థానాల విలీనం కొరకు పోరాడింది ప్రపంచ ధనవంతుడైన భారత యూనియన్‌లో కలుపుటకై కమ్యూనిస్టులు అమరులైన 25వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేయడం జరిగిందన్నారు.కేరళలో బాయిలర్ సాయుధ పోరాటం మణిపూర్‌లో రాజరిక వ్యతిరేక పోరాటం,బెంగాలోమ్ల ఏ బాగా ఉద్యమాన్ని కొనసాగించిందని గుర్తు చేశారు.అంతేగాక భారత భూసంస్కరణలపై అవినీతి పుట్టినట్టు భూమిక పోషించిన 2జీ స్పెక్టన్ కుంభకోణాలు వెలితీయడంతో పాటు విదేశాల్లో ఉన్న నల్ల ధనాన్ని రప్పించుటకై ఒత్తిడి చేయడం జరిగిందన్నారు.పార్టీ అవిర్భావంతో ఎన్నో పోరాటాలను చేస్తు పేద ప్రజలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.మన దేశంలో కార్పోరేట్ డబ్బులతో ప్రభుత్వాలు ఏర్పడి జాతీయ సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టుటకై ప్రయత్నిస్తుండడంపై పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కార్యక్రమంలో కొడంగల్,బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల నాయకులు ఎండీ.మహిమూద్,ముతుల రాజు,ముస్తాఫా,అబ్దుల్ రహీం,నీటూర్ సర్పంచ్ వెంకటప్ప,డీహెచ్‌పీఎస్ అద్యక్షులు వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ పార్టీ జెండాను ఆవిష్కరించిన నేతలు



పార్టీ జెండా ఆవిష్కరణతో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి బషీర్

# కరాటేతో మానసికంగా శారీరకంగా మారింత ధృడత్వం

**- సీనియర్ సినిమా యాక్టర్, ఎస్‌సీఎంఏఏ చైర్మన్ సుమన్**

**- 300 మందికి చిన్నారులకు కరాటే బెల్టులు, మెమొంటోల ప్రధానోత్సవం**

**షాద్‌నగర్, డిసెంబర్ 25, (ప్రభాతవార్త) :**
చిన్నతనం నుంచే కరాటే విద్య నేర్చుకోవడం వల్ల చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఎంతో దృఢత్వం సాధిస్తారని, తద్వార ఎలాంటి అటుపోట్లు ఎదురైన ఎదురు నిలిచి పోరాడుతారని సీనియర్ సినిమా యాక్టర్, ఎస్‌సీఎంఏఏ చైర్మన్ సుమన్ విద్యార్థులకు సూచించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామ సమీపంలోని ఇండియాన్ హైట్స్ స్కూల్ ఆవరణలో యాదవ్ బూడోకాన్ కరాటే క్లబ్ నిర్వహకుడు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎస్‌సీఎంఏఏ 21 సంవత్సరాల వార్షికోత్సవం, వైబీకేసీఐ 35వ వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీనియర్ సినిమా యాక్టర్, ఎస్‌సీఎంఏఏ చైర్మన్ సుమన్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్, పాఠశాల చైర్మన్ భూవనేశ్వర్‌లు హాజరయ్యారు. మొదటగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతనం ఉత్తమ ప్రదర్శన కనబర్చిన 300 మంది విద్యార్థులకు బ్లాక్, బ్రౌన్, గ్రీన్ తదితర బెల్టులను హీరో సుమన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత జనరేషన్‌లో ప్రతి ఒక్కరికి తమను తాము కాపాడుకోవడానికి యుద్ధ విద్యలు ఎంతగానో ఉపయోగపడుతాయని, ప్రతి చిన్నారి కరాటే, కుంగ్‌ఫు వంటి విధ్యలు నేర్చుకుంటే భవిష్యత్తులో మానసికంగా శారీరకంగా మారింత దృఢత్వం సాధిస్తారని అన్నారు. విద్యార్థులు విధ్యతో పాటు ఇతర విద్యాల్లో సహితం రాణించాలని ఆయన ఆకాక్షించారు. తమ జనరేషన్‌లో కరాటే విద్యా నేర్చుకోవడానికి చాలా తక్కువ అవకాశాలు ఉండేవని ఇప్పుడు ఆ ఇబ్బందులు లేవని ఎవరైనా నేర్చుకోవడానికి అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా షాద్‌నగర్‌లో మాస్టర్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎంతో మంది ప్రతిభవంతులు కరాటేలో ఉత్తమ ప్రదర్శన ప్రదర్శిస్తున్నారని, వివిధ పోటీలో పాల్గొని షాద్‌నగర్‌కు, మాస్టర్‌కు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తున్నారని ఆయన కొనియాడారు. రాబోయే రోజుల్లో మరింత మంది కరాటేలో రాణించాలని కోరారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... షాద్‌నగర్ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారని, విద్యార్థులకు కరాటే లాంటి విధ్యలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాదవ్ బూడోకాన్ కరాటే క్లబ్ నిర్వహకుడు మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో హీరో సుమన్‌ను, కాంగ్రెస్ నాయకుడు వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, 22వ వార్డు కౌన్సిలర్ నడికూడ సరితాయాదగిరియాదవ్, కార్మిక నాయకుడు రఘు, కరాటే మాస్టర్లు సాయినాథ్, ఉత్తేజ్, రామకృష్ణ, నరేందర్, వినోద్, గోపి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన చిన్నారులకు మెమోంటో, బెల్టులు పంపిణీచేస్తున్న సుమన్, తదితరులు

## వైశ్య ఫెడరేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

**తాండూరు, డిసెంబరు 26, ప్రభాతవార్త :**
ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని వైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం అండ్ డెవలప్ మెంట్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా చేతుల మీదుగా 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదేవిదంగా ఐవీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రొంపల్లి సంతోష్‌కుమార్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తాండూరు అధ్యక్షులుగా కేళిగారి ప్రవీణ్‌కుమార్, కార్యదర్శిగా రెడ్డి శెట్టి సతీష్, కోశాధికారిగా చల్ల గుణవర్ధన్‌రెడ్డి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టూరిజం చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రొంపల్లి సంతోష్‌కుమార్ చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవాకార్యాక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళిగుప్తా, రాష్ట్ర కోశాధికారి నారాయణ, జిల్లా కోశాధికారి ఆగేరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి పెద్దపీట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హాఫీజ్

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 26, (ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సయ్యాద్ హాఫీజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలెకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎప్పుడు లేని విదంగా ప్రభుత్వం మండలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజురు చేసిందని అన్నారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో మండలాభివృద్ధికి నిధులు మంజురు కావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. మండలంలోని ఏడు గ్రామాల్లో నూతన గ్రామ పంచాయితీ భవణాలకు కోటి 40లక్షలు మంజురు అయినట్లు ఆయన వివరించారు. బీటి రోడ్ల కోసం ఎఫ్‌డీఆర్ నిధుల నుంచి 13కోట్ల లక్ష రూపాయలు మంజురు అయినట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు త్వరలో బీటి రోడ్లు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. ఈ విలెకరుల సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బాబురావు, రైతు కో ఆర్డినేటర్ వజ్రలింగం, పిఏసిఎస్ డైరెక్టర్ జబ్బార్, ఎంపిటిసి రాములు, నాయకులు కొండి యాదయ్య, కృష్ణయ్య, బంగారు రాములు, నర్సింహులు, చంద్రబాబుగౌడ్, శివరాజ్, రవీందర్, కుమార్‌గౌడ్, మొతిలాల్‌నాయక్, చందర్‌నాయక్, చంద్రశేఖర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు బుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**-కెఎస్ రూరల్ మీడియా కళాసంస్థ ప్రతినిధి మురళి**



న్యాలట గ్రామంలో బ్యాంకు రుణాలపై అవగాహన కల్పిస్తున్న కెఎస్ రూరల్ మీడియా కళాసంస్థ ప్రతినిధి మురళీ

**చేవెళ్ళ,డిసెంబర్ 26,ప్రభాతవార్త**
బ్యాంకు బుణాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కఎస్ రూరల్ మీడియా కళాసంస్థ ప్రతినిధి మురళీ సూచించారు. సోమవారం స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా చేవెళ్ళ బ్యాంకు అద్వర్యంలో న్యాలట గ్రామంలో అర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కఎస్ రూరల్ మీడియా కళాసంస్థ ప్రతినిధి మురళీ మాట్లాడుతూ జాతీయ వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకు నాబార్డు సహకారంతో బ్యాంకు రుణాలు చెల్లించాలన్నారు. ప్రధాన మంత్రి జన్దన్ బీమా యోజన పథకాలు నగదు రహిత లావాదేవీలనఎ పంబందించిన రూపే కార్డును వినియోగించాలన్నారు. బ్యాంకులో హౌసింగ్‌లోను ట్రాక్టర్లు బంగారు అభరణాలపై రుణాలు ఎస్‌హెచ్‌జి లోన్స్ క్రాప్‌లోనులను ప్రతి ఒక్కరు తీసుకుని చెల్లించాలన్నారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం, అటల్ పెన్షన్ యోజన ప్రతి మనిషి కూడా ఇన్సురెన్స్ ఉండాలన్నారు.కళాజాత బృందాలు ప్రజలకు అవగాహన కల్పించారు. కళాసంస్థ అధికారులు శశి, బ్రహ్మయ్య, రవి, శంకర్ పాల్గొన్నారు.

## సమస్త మానవాళికి మంచి జరగాలి

**-స్వాములకు అన్నదానం చేసిన మాజీ ఎమ్మెల్యే**



అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

**నందిగామ డిసెంబర్26,ప్రభాతవార్త :**
విశ్వమానవాళికి ధర్మ తత్వాన్ని బోధించిన ధర్మ శాస్త్ర,అయ్యప్ప దీవెనలు ప్రతి ఒక్కరికి లభించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి వేడుకున్నారు.సోమవారం నందిగామ మండలం చాకలిధనిగుట్ట గ్రామపంచాయతీలోని తాటిగడ్డ తండాలో అయ్యప్ప సన్నిధానంలో స్వాములకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇరుముడితో శబరిమలై వెళ్లే స్వాములు క్షేమంగా వెళ్లి రావాలని ఆ భగవంతుని కోరుకున్నట్లు చెప్పారు.అయ్యప్ప కరుణ,కృపాకటాక్షంతో సమస్త మానవాళికి శుభాలు,మంచి జరగాలని కొరుకున్నారు.అంతకు ముందు అయ్యప్పకు అత్యంత భక్తిశ్రద్ధలతో గురుస్వామి జెట్టావత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.స్వాముల శరణుగోషతో,అయ్యప్ప నామస్మరణతో సన్నిధానం పరిసర ప్రాంతం మారుమ్రోగుతూ ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.ఈ వేడుకల్లో గురుస్వాములు లక్ష్మయ్య,నావాబ్ పేట చంద్రశేఖర్,నాగేష్,మేకం రాజు,గోపాల్ యాదవ్,వినోద్ నాయక్ స్వామి,శ్రీధర్ గౌడ్,నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుండి వచ్చిన స్వాములు,అయ్యప్ప భక్తులు,బిఆర్‌ఎస్ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## నలంద విద్యార్థుల పూర్వ సమ్మేళనం

**ఆమనగల్లు, డిసెంబర్26, ప్రభాతవార్త:**
ఆమనగల్లు పట్టణంలోని నలంద విద్యాలయం చెందిన 2002-03 పదవతరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమేళనం నిర్వహించారు. నాడు బాల్యంలో కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఒక్కచోటికి చేరుకుని గత స్మృతులను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. విఠాయిపల్లి గ్రామంలోని బిఎన్ఆర్ గార్డెన్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేయగా వివిధ ప్రాంతాలలో స్థిరపడిపోయిన వీరంతా తిరిగి కలుసుకున్నారు. సమ్మేళనంకు నాడు విద్యబోధించిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. అందరూ ఆనందంగా ఉత్సాహంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు నల్లబోలు సుధీర్‌రెడ్డి, చుక్క అల్లాజిగౌడ్, నర్సింహ్మా, బాలేశ్వర్, ఇల్లెందుల జగన్, లక్ష్మి, అనిత, వసంత, శ్రీనివాస్ గౌడ్, నరసింహ, శేషం, విడియాల ప్రసాద్, వందన, కమటం శేఖర్, ఉమాపతిగౌడ్, సుధా, రేవతిలను శాలువాతో సత్కరించి సన్మానించారు. నాడు ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధం, బోధించిన తీరును మళ్ళి గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. భవిష్యత్తులో కలిసి సేవా కార్యక్రమాలు చేయాలని తీర్మానించుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆనందంగా గడిపి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌సింగ్, రజినిరెడ్డి, అనురాధ, శాలిని, మానస, శ్రావణి, గౌతమ్‌రెడ్డి, కరుణాసాగర్, హైమద్, నిరంజన్‌గౌడ్, రవి, రమేశ్, రాజశేఖర్, స్వాతి, రాణి, అనిత, కమలరాణి, శ్వేత, గోపాల్, వెంకటాచారి, మల్లేశ్, జ్యోతి, గోరెటి రాజు, శ్రీనివాస్‌నాయక్, రాజకుమార్, మహేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌నాయక్ తదితరులు ఉన్నారు.



నాటి ఉపాధ్యాయులతో బాల్యమిత్రులు

## స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం



స్నేహితుని కూతురుకు చెక్కు అందజేస్తున్న స్నేహితులు

**కుల్కచర్ల డిసెంబర్ 22,ప్రభాతవార్త;**
10 తరగతి వరకు కలిసి చదువుకున్నారు.ఆపై ఎవరి పనుల్లో వారు స్థిరపడ్డారు.కలిసి చదువుకున్న క్లాస్‌మేట్స్ ఎవరిదారిన వారు పోకుండా తోటి స్నేహితులకు ఆసరా అవ్వాలనే నిశ్చయంతో గత కొన్ని సంవత్సరాల క్రితం 1996 వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న స్నేహితులు మోడల్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఏర్పడి అనారోగ్యంతో బాధపడుతున్న,మరణించిన కుటుంబాలకు తమ వంతు సహకారం అందిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.సోమవారం గత కొన్ని సంవత్సరాల క్రింతం మరణించిన చిన్ననాటి స్నేహితుడు వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన మంగళి రాజు కూతురు శ్రావణికి 20,000 రూపాయల ఫిక్స్ డిపాజిట్ చెక్కును అందజేశారు.అనంతరం పిహెచ్‌డి చదువుకుని ఆపదలో ఉన్న బందవెల్కిచర్ల గ్రామానికి చెందిన వెంకటయ్య కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగాతోటి స్నేహితులు మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా ఆపదలో ఉన్న స్నేహితులకు అందరం తలా కొంత డబ్బు పోగుచేసి బాధితులకు అందిస్తున్నామని అన్నారు.మరికొంత మంది స్నేహితులు వ్యక్తిగతంగా సహకారాలు అందిస్తున్నారని రాబోవు రోజుల్లో మరింత మందికి సహకారం అందేలా కృషి చేస్తామని అన్నారు.పక్కనున్న వాడిని కూడా పట్టించుకోని ఈ సమాజంలో ఎప్పుడో 25 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులను గుర్తించి వారికి తోచిన విదంగా నిష్పక్ష పాతంగా సహకారం అందించడం గొప్ప విషయమని పలువురు అభినందిస్తున్నారు. ఈ కాకార్యక్రమంలో తోటి స్నేహితులు ప్రకాష్(బిజినెస్),మన్నాన్(టీచర్) ,వెంకటయ్య(టీచర్),రాఘవేందర్( వార్డెన్),ఇబ్రహీం (అడ్వకేట్),వెంకటయ్య(ఫీల్డ్ అసిస్టెంట్),సొర్ల రాములు(హస్పిటల్),జెఎల్‌బి శాస్త్రి(రిపోర్టర్),సంజయ్‌గౌడ్(రామలింగేశ్వర ఆలయ కమిటి మెంబర్),హన్మంతు(రైతు),రమేష్(డ్రైవర్),ప్రదీష్(బిజినెస్)నర్సిములు(వార్త దినపత్రిక జర్నలిస్ట్) పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 26, (ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో సోమవారం సిసి రోడ్డు పనులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హాఫీజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. చౌదరిగూడలో కోటి పదిలక్షలతో సిసి రోడ్డు పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు. గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజురు చేయించిన ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ గూడ వెంకటస్వామి, ఉపసర్పంచ్ అనిల్, సిపిఎస్ డైరెక్టర్ జబ్బార్, నాయకులు మాణెయ్య, కృష్ణయ్య, రాములు, కొండి యాదయ్య, అజ్మీరి పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న హాఫిజ్